



విశాఖ ద్వారకా సిటీ బస్టాప్ వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కలెక్టరేట్‌కు సొంత గూడు!

రూ.99.9 కోట్లతో భవనాల సముదాయం నిర్మాణానికి సర్కారు ఆమోదం

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉత్తర్వులు జారీ
- ఏడాదిన్నర క్రితమే 15 ఎకరాల స్థలం కేటాయింపు
- అధికారుల నివాస గృహాల నిర్మాణానికి స్థలాల అన్వేషణ

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

ఎట్టకేలకు రెండేళ్ల తరువాత స్థానిక కలెక్టరేట్‌కు సొంతగూడును సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా రూ.99.9 కోట్ల వ్యయంతో కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించేందుకు గాను ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



కలెక్టరేట్ సముదాయం నిర్మాణానికి ఎంపిక చేసిన ప్రదేశం



ప్రస్తుతం కలెక్టరేట్ నిర్వహిస్తున్న యూత్ ట్రైనింగ్ సెంటర్

రాష్ట్రంలోని 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించిన క్రమంలో 2022 ఏప్రిల్ నెలలో ఐటీడీఏ, రెవెన్యూ డివిజన్ పాడేరు కేంద్రంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు పేరిట పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ కొత్త జిల్లాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో అప్పటి వరకు గిరిజన యువతకు వివిధ వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చే స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను కలెక్టరేట్‌కు కేటాయించారు. దీంతో అక్కడే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో, సర్వేవిభాగం, జిల్లా ఖజానా కార్యాలయం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ, జిల్లా ప్రజా సంబంధాల అధికారి కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల్లో మరికొన్ని శాఖలకు చెందిన జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఒకే ప్రదేశంలో జిల్లా కలెక్టర్‌తో సహా మరో ఏడు శాఖలకు చెందిన కార్యాలయాలను యూత్ ట్రైనింగ్ సెంటర్‌లోనే ఏర్పాటు చేయడంతో వసతి సమస్యతోపాటు వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తప్పడం లేదు.

హైవేను ఆనుకుని 15 ఎకరాల స్థలం కేటాయింపు

స్థానిక కలెక్టరేట్ సముదాయం నిర్మాణానికి రెవెన్యూ అధికారులు పదిహేను ఎకరాల స్థలాన్ని గుర్తించారు. కలెక్టరేట్ సముదాయాన్ని విశాలంగా నిర్మించాలని, అక్కడే జిల్లా పోలీసు కార్యాలయం ఉండాలనే నిబంధన ప్రభుత్వం విధించింది. దీంతో పదిహేను ఎకరాల్లో కలెక్టరేట్ సముదాయం నిర్మాణానికి అనువుగా ఉండేలా పాడేరు నుంచి హుకుంపేట వెళ్లే జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పట్టుపరిశ్రమ శాఖకు చెందిన స్థలాన్ని అధికారులు గుర్తించారు. తొలుత చింతల వీధి పంచాయతీ పరిధిలోని నడిమివీధి కొండపై ఉన్న ప్రభుత్వం స్థలాన్ని పరిశీలించినప్పటికీ, స్థలం చదునుగా లేకపోవడంతో అక్కడ వద్దనుకున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన స్థలం పాడేరు నడిబొడ్డున వున్న అంబేడ్కర్ కూడలికి కేవలం కిలో మీటరున్నర దూరంలో, జాతీయ రహదారికి పక్కనే ఉండడంతో ఇదే కలెక్టరేట్ సముదాయం నిర్మాణానికి అన్ని విధాలా బాగుంటుందని అధికారులు భావించారు. దీంతో ఆ పదిహేను ఎకరాల స్థలాన్ని గుర్తించి, అక్కడే కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. అక్కడే రూ.100 కోట్ల వ్యయంతో కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించేందుకు గతంలోనే జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ క్రమంలో రూ.99.9 కోట్ల వ్యయంతో కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించేందుకు గాను తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ ... మిగతా 6వ పేజీలో

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

99.999, 99.990 పర్సంటైల్ సాధించిన విశాఖ విద్యార్థులు



రిషివర్ధన్
99.999 /1000



ధనుకొండ శ్రీనిధి
99.990 /1000

- వెయ్యి నుంచి 1,500 మంది 99.00 నుంచి 99.999 పర్సంటైల్ సాధించారని అంచనా
- కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థుల హవా

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ/ఎన్ఐటీల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ 'సెషన్-1'లో విశాఖపట్నం విద్యార్థులు సత్తా చాటారు. నగరంలో చదివిన మద్ది రిషివర్ధన్ 99.999, ధనుకొండ శ్రీనిధి 99.990 పర్సంటైల్ సాధించారు. ఏటా రెండు పర్యాయాలు జేఈఈ పరీక్షలు నిర్వహిస్తారు. తొలి సెషన్ గత నెలలో 300 మార్కులకు నిర్వహించారు. ఏప్రిల్‌లో మరోమారు పరీక్ష నిర్వహిస్తారు. తొలి సెషన్ పరీక్షలకు నగరంలో 20 వేల మంది వరకూ హాజరయ్యారు. తొలి సెషన్ పరీక్షలో శ్రీచైతన్య, నారాయణ, ఫిట్జీ, అసెంట్, తదితర సంస్థల్లో చదివిన విద్యార్థులు మెరుగైన పర్సంటైల్ సాధించారు. 99.00 నుంచి 99.999 పర్సంటైల్ వరకూ 1000 నుంచి 1500 మందికిపైగా సాధించారని అంచనా వేస్తున్నారు. నారాయణ విద్యా సంస్థకు చెందిన మద్ది రిషివర్ధన్ 99.999 పర్సంటైల్‌తో మొదటి స్థానంలో, శ్రీచైతన్య ఐఐటీ అకాడమీకి చెందిన ధనుకొండ శ్రీనిధి 99.990 పర్సంటైల్‌తో రెండో స్థానంలో నిలిచారు. రిషివర్ధన్ గణితంలో 100కి 100, ఫిజిక్స్‌లో 90, కెమిస్ట్రీలో 95 మార్కులు సాధించాడు. నారాయణ విద్యా సంస్థల్లో 99.900, అంతకంటే ఎక్కువ పర్సంటైల్ 57 మంది సాధించారు. శ్రీచైతన్యకు చెందిన కోరుప్రోలు రాకేశ్ 99.978, బీరి సాహితి 99.977, చింతల తేజస్విని మనోజ్ఞ 99.974 ... మిగతా 6వ పేజీలో

ప్రయాణికులతో ఆడుకున్నారు

సీఎం సభకు నాలుగో వంతు ఆర్టీసీ బస్సులు

- ఉదయం 10 గంటల నుంచే మళ్లింపు
- బస్టాపుల్లో జనం పడిగాపులు
- మరోవైపు వార్డుల్లో ఆర్‌పీల బెదిరింపులు
- సభకు రాకపోతే రుణమాఫీకి
- సంతకాలు చేయబోమని డ్వాక్రా గ్రూపు సభ్యులకు హెచ్చరికలు
- అయినా స్పందన శూన్యం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం...ఆంధ్రా' క్రీడా పోటీల ముగింపు వేడుకల నిర్వహణ పేరుతో పాలకులు మంగళవారం నగర ప్రజలకు చుక్కలు చూపించారు. పీఎం పాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటుచేసిన బహుమతి ప్రదానోత్సవాన్ని రాజకీయ కార్యక్రమంగా మార్చేశారు. సీఎం జగన్ హాజరవ్వడంతో ఆర్టీసీ బస్సుల్లో నాలుగో వంతు (230) జనాన్ని తరలించేందుకు కేటాయించారు. దాంతో ఆర్టీసీ బస్సులపై ఆధారపడిన నగర వాసులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

స్టేడియం వద్దకు జనాలను తరలించేందుకు నగరంలో వార్డుకు ఐదు నుంచి ఎనిమిది బస్సులు చొప్పున కేటాయించారు. జనసమీకరణ బాధ్యతలను డ్వాక్రా గ్రూపుల ఆర్‌పీలకు అప్పగించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఈ బస్సులు బయలుదేరాల్సి ఉండగా చాలాచోట్ల ఎవరూ ముందుకు రాలేదు. దాంతో గ్రూపు సభ్యులకు ఆర్పీలు ఫోన్లు చేసి తప్పనిసరిగా రావాల్సిందేనని చెప్పారు. అయినా ఎవరూ స్పందించకపోవడంతో బెదిరింపులకు దిగారు. ప్రస్తుతం రుణమాఫీ కార్యక్రమం జరుగుతోందని, సీఎం సభకు రానివారికి ఆ పత్రాలపై సంతకాలు చేయబోమని హెచ్చరించారు. బస్సులో వచ్చిన వారికే రుణ మాఫీ జరుగుతుందని స్పష్టంచేశారు. దాంతో మహిళలు కొంతమంది తిట్టుకుంటూనే బస్సులు ఎక్కారు. అయినా చాలా బస్సులు పది నుంచి పదిహేను మందితోనే బయలుదేరి వెళ్లాయి. ఉత్తర నియోజకవర్గంలో సభకు తీసుకువెళ్లే మహిళల కోసం పోర్టు స్టేడియంలో బిర్యానీ తయారు చేయించి, ప్యాకెట్లు కట్టి పంపిణీ చేశారు. అయితే సీఎం జగన్ సాయంత్రం ఆరు గంటలకు వస్తారని, రాత్రి ఎనిమిది గంటల వరకు ఉండాలని అక్కడికి వెళ్లాక తెలియడంతో చాలా మంది ఆయన రాక ముందే తిరుగు ముఖం పట్టారు. వెళ్లిన బస్సులో వచ్చే అవకాశం లేకపోవడంతో సొంత డబ్బులు పెట్టుకొని ఆటోలలో ఇళ్లకు చేరుకున్నారు. ఇలా మహిళలు వెళ్లిపోతున్నారని గమనించిన నిర్వాహకులు స్టేడియంలో గేట్లకు తాళాలు వేసేశారు.

ప్రజల ఇక్కట్లు

విశాఖపట్నం రీజియన్‌లో ఆర్టీసీకి 820 బస్సులు ఉన్నాయి. వాటిలో 230 బస్సులు సీఎం సభకు కేటాయించడంతో చాలా రూట్లలో ... మిగతా 5వ పేజీలో

ఖజానా అధికారుల తీరుపై

కలెక్టర్ గుర్రు

- విధులకు ఆలస్యం కావడంతో కార్యాలయానికి తాళం వేసిన కలెక్టర్
- అధికారులు ప్రాధేయపడగా గంట తరువాత మందలించి తెరిచిన వైనం



కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయం

పాడేరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా అధికారులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ గుర్రుగా వున్నారు. కలెక్టరేట్ ఆవరణలో వున్న జిల్లా ఖజానా కార్యాలయానికి మంగళవారం ఉదయం పది గంటలకు సైతం అధికారులు, సిబ్బంది విధులకు రాకపోవడాన్ని కలెక్టర్ గుర్తించారు. దీంతో తాళం వేసి వున్న కార్యాలయానికి మరో తాళం వేశారు. తీరిగ్గా పదిన్నర గంటలకు వచ్చిన ట్రెజరీ అధికారులు తమ కార్యాలయానికి రెండు తాళాలుండడాన్ని చూసి ఖంగుతున్నారు. అసలు విషయం తెలుసుకుని కలెక్టర్ వద్దకు వెళ్లారు. దీంతో వారిని మందలించి పదకొండు గంటలకు కలెక్టర్ తాళాలు తీయించారు.

జిల్లా ఖజానా అధికారుల తీరుపై అసంతృప్తి

స్థానిక జిల్లా ఖజానా అధికారుల తీరుపై కలెక్టర్ ముందు నుంచి అసంతృప్తితోనే వున్నారు. గతంలోనూ జిల్లా ఖజానా కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆగ్రహించిన కలెక్టర్.. కార్యాలయానికి తాళం వేయించారు. గతేడాది రెవెన్యూ, పోలీస్ శాఖలకు చెందిన పలు బిల్లుల విషయంలో మామ్ముళ్లు డిమాండ్ చేయడంపై ఉన్నతాధికారులకు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. దీనిపై ... మిగతా 6వ పేజీలో

ఎప్పటికి దారికొచ్చేనో?

గోతులమయంగా పరదేశిపాకలు- బంగారమ్మపేట రహదారి

- 10 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు
- రహదారి పునర్నిర్మాణానికి గత ఎన్నికల్లో హామీ ఇచ్చి మరిచిన వైసీపీ
- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆయా గ్రామ వాసుల ఆవేదన



పరదేశిపాకలు- బంగారమ్మపేట మధ్య గోతులమయంగా ఉన్న రహదారి

కొయ్యూరు, ఫిబ్రవరి 13: పరదేశిపాకలు- బంగారమ్మపేట రహదారి అడుగడుగునా గోతులతో అధ్వానంగా ఉంది. దీంతో 10 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఎన్నికల సమయంలో రహదారిని పునర్నిర్మిస్తామని వైసీపీ నేతలు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు ఆచరణకు నోచుకోలేదు.

పాతకృష్ణాదేవి పేట నుంచి బంగారమ్మపేట, అంతాడ పంచాయతీలకు చెందిన సుమారు పది గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గత దశాబ్దకాలంగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు. పాత కృష్ణాదేవిపేట నుంచి పరదేశిపాకలు, బంగారమ్మపేట మధ్య రహదారి పూర్తిగా దెబ్బతిని రాళ్లు పైకి తేలాయి. దీని వల్ల సుమారు 10 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దం క్రితం ఈ రహదారిని నిర్మించారు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులు చేయలేదు. గత ఏడాది కురిసిన వర్షాలకు ఈ రహదారి మరింత గోతులమయమైంది. దీంతో ఈ రహదారిపై నిత్యం రాకపోకలు సాగించే అంతాడ, బంగారమ్మపేట పంచాయతీలకు చెందిన సుమారు పది గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి పలుమార్లు కోరినా ఫలితం లేకపోయిందని ఆయా గ్రామ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరిట పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఈ రహదారి గుండా ప్రయాణించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి రహదారి మరమ్మతులపై చర్యలు తీసుకోకపోవడం దారుణమని వాపోతున్నారు. గత ఎన్నికల సమయంలో ఈ రహదారికి మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక మరిచిపోయారని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారికి కనీసం మరమ్మతులు అయినా చేయించాలని వారు కోరుతున్నారు.

వసతి గృహంలో బాలిక ఆత్మహత్య

- ఇంటి నుంచి వచ్చిన గంట వ్యవధిలోనే ఘటన



కిల్లో వసంత (ఫైల్ ఫొటో)

అరకులోయ, ఫిబ్రవరి 13: ఇంటి నుంచి వసతి గృహానికి వచ్చిన ఓ బాలిక గంట వ్యవధిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అరకులోయ కంఠబౌంసుగుడ టీడబ్ల్యూ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి హెచ్ఎం ఎస్.రాజ్యలక్ష్మి, ఏటీడబ్ల్యూవో మల్లికార్జున తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. డుంబ్రిగుడ మండలం ఒంబి గ్రామానికి చెందిన కిల్లో వసంత(14) అరకులోయ కంఠబౌంసుగుడ టీడబ్ల్యూ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే చర్యల్లో భాగంగా అధికారులు ఈ బాలికను గత ఏడాది సెప్టెంబరు నెలలో ఆశ్రమోన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ బాలిక బాగానే చదువుకుంటోంది. అయితే ఆ బాలిక తండ్రి ఓ కేసులో శిక్ష పడి పదేళ్లుగా విశాఖ సెంట్రల్ జైలులో ఉంటున్నాడు. అతని ఆరోగ్యం బాగోకపోవడం, పిల్లలను చూడాలని ఉందని చెప్పడంతో ఆ బాలిక తల్లి శుక్రవారం ఆశ్రమోన్నత పాఠశాలకు వచ్చి అనుమతి తీసుకుని వసంతను ఊరు తీసుకువెళ్లింది. తల్లితో పాటు తన తోబుట్టువులతో వసంత ఆదివారం విశాఖ సెంట్రల్ జైలుకు వెళ్లి తండ్రిని చూసి వచ్చింది. అక్కడి నుంచి ఇంటికి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు వసతి గృహానికి వచ్చింది. తరగతులకు హాజరయ్యేందుకు యూనిఫాం వేసుకుంది. తరువాత వస్తానని చెప్పడంతో తోటి విద్యార్థినులు తరగతులకు వెళ్లిపోయారు. ఇంతలో వసంత ఫ్యాన్ హుక్కుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరు విద్యార్థినులు గదికి వచ్చేసరికి వసంత వేలాడుతూ కనిపించింది. దీంతో వారు పరుగున వెళ్లి కిందనే ఉన్న వర్కర్లకు చెప్పారు. వారు వెంటనే వచ్చి ఆ బాలికను కిందకు దించారు. ఆ బాలికలో చలనం లేకపోవడంతో అరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహిళా ఎస్ఐ రేణుక, సిబ్బంది అక్కడికి వచ్చి వివరాలు సేకరించారు. సీఐ రుద్రశేఖర్ వసతి గృహానికి వచ్చి విచారణ జరిపారు. ఇంటి నుంచి వచ్చిన గంట వ్యవధిలోనే ఆ బాలిక ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు. కాగా విషయం తెలిసి వసతి గృహానికి వచ్చిన బాలిక తల్లి, బంధువులు అక్కడే ఉన్న హెచ్ఎం, వార్డెన్, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన చోటే మృతదేహాన్ని ఉంచాల్సిందని, ఎందుకు ఆస్పత్రికి తరలించారని వారిపై మండిపడ్డారు. వందలాది మంది పిల్లలున్న వసతిగృహంలో మృతదేహాన్ని ఉంచితే బాలికలు భయాందోళన చెందుతారని అరకు ఆస్పత్రి మార్చురీకి తరలించినట్టు సీఐ నచ్చజెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మన్యం గజగజ

దిగజారుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- జీకేవీధిలో 7.2, జి.మాడుగులలో 8 డిగ్రీలు



పాడేరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు దిగజారుతున్నాయి. దీంతో చలికి జనం గజగజ వణుకుతున్నారు. పొగమంచు, చలి తీవ్రత కొనసాగుతున్నది. పాడేరులో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు వీడలేదు. మన్యంలో జీకేవీధిలో 7.2 అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది.

పాడేరు మెయిన్‌రోడ్డులో మంగళవారం ఉదయం కమ్ముకున్న పొగమంచు



చింతపల్లిలో మంచు

జి.మాడుగులలో 8, పాడేరులో 8.6, అరకులోయలో 8.7, పెదబయలులో 9.2, హుకుంపేటలో 9.3, అనంతగిరిలో 11.9, డుంబ్రిగుడలో 12.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గత రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు చేరడంతో చలి తీవ్రత పెరిగింది. దీంతో మన్యం వాసులు ఉన్ని దుస్తులు ధరించి, చలి మంటలు వేసుకుని ఉపశమనం ... మిగతా 6వ పేజీలో

నేడు జడ్పీ సమావేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ హాలులో జరుగుతుందని సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరగనున్న సమావేశానికి జిల్లాలో అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

మామిడి, జీడిమామిడి తోటలకు తెగుళ్లు

- వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- ఆలస్యం చేస్తే దిగుబడులపై ప్రభావం
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు

సబ్బవరం, ఫిబ్రవరి 13 : మామిడి, జీడిమామిడి తోటలు ప్రస్తుతం మొగ్గ, పూత దశల్లో వున్నాయి. రానున్న రోజుల్లో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు తోటలను నిరంతరం పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు సూచిస్తున్నారు. పూత, పిందె సమయంలో పొగమంచు, కీటకాలు, తెగుళ్ల కారణంగా దిగుబడులు తగ్గిపోతాయని, ఇటువంటి వాటిని నివారించడానికి ఉద్యాన శాఖ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని అన్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈసారి పూత ఆలస్యంగా వస్తున్నదని, అందువల్ల రైతులు మరింత అప్రమత్తంగా వుండాలని ఆయన సూచిస్తున్నారు. మామిడి, జీడిమామిడి తోటలను ఆశించే తెగుళ్లు, నివారణ చర్యల గురించి జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు తెలిపిన వివరాలు..

అనకాపల్లి జిల్లాలోని వివిధ మండలాల్లో 18 వేల ఎకరాల్లో మామిడి, సుమారు 60 వేల ఎకరాల్లో జీడిమామిడి తోటలు వున్నాయి. రైతులు సకాలంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఇందుకుగాను తోటలను రోజూ పరిశీలిస్తూ తెగుళ్లు, చీడపీడల లక్షణాలను గుర్తించి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పూత సమయంలో నీరు అధికంగా పెట్టకూడదు. పొటాషియం నైట్రేట్ ఎరువును లీటరు నీటికి 5 నుంచి 10 గ్రాముల వరకు నీటిలో కలిపి కొమ్మలన్నీ తడిచేలా పిచికారీ చేయడం వల్ల పూత బలంగా వుంటుంది.


మామిడి తోటలో తెగుళ్ల నివారణ మందును పిచికారీ చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)


సబ్బవరం మండలం గుల్లేపల్లిలో మామిడి పూతను పరిశీలిస్తున్న జిల్లా జిల్లా ఉద్యాన అధికారి జి.ప్రభాకరరావు, సిబ్బంది


మామిడి తోటలో సస్యరక్షణ చర్యలు.. (ఫైల్ ఫొటో)

మామిడి తోటల్లో...

తేనెమంచు పురుగు: ఇవి లేత ఆకులు, మొగ్గలు, పూత, కాడలమీద గుడ్లు పెడతాయి. వారం రోజుల వ్యవధిలో పిల్లలు వచ్చి ఆకులు, పిందెల నుంచి రసం పీల్చడం మొదలుపెడతాయి. ఆకులు నల్లగా మారిపోతాయి. పురుగులు విసర్జించిన తేనెవంటి పదార్థంపై నల్లని మసి ఏర్పడి, కిరణజన్య సంయోగక్రియ జరగక దిగుబడి పడిపోతుంది. తేనెమంచు పురుగుల నివారణకు పూత దశలో ఇమిడాక్లోప్రిడ్ లేదా తయోమిదాక్సమ్ మందును లీటరు నీటికి 0.6 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పూత, మొగ్గ దశలో వుంటే లీటరు నీటికి అసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరిపైరిఫాస్ మందు రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తోటలు తెల్లపూత దశలో వుంటే ఎటువంటి మందులు పిచికారీ చేయకూడదు. పిందె దశలో వుంటే ఫిప్రానిల్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఈ దశలో పిందె రాలకుండా ప్లానోఫిక్స్ మందును లీటరు నీటికి ఒక మిల్లీలీటర్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు: ఈ పురుగులు కోడిపేనుల మాదిగా చాలా చిన్నవిగా, గోదుమ రంగులో ఉండి కొత్త చిగుళ్లను, పిందెలను గోకి, గీరి రసాన్ని పీల్చడంతో ఆకులు కమిలిపోయినట్టుగా పిందెలపై మంగు ఏర్పడుతుంది. వీటి నివారణకు లీటరు నీటికి ఇమిడాక్లోప్రిడ్ మూడు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు: ఈ తెగులు రాత్రిళ్లు బాగా చల్లగా, పగటిపూట ఎండ అధికంగా ఉన్నపుడు ఆశిస్తుంది. పూత కాడలు, చిరు పిందెలపై తెల్లని పొడిలా ఏర్పడి బూజు పెరుగుతుంది. దీని వల్ల పూతకాడలు రాలిపోతాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి డినోకాప్ ఒక గ్రాము లేదా ట్రైడ్‌మార్ఫ్ ఒక గ్రాముసు కలిపి పిచికారీ చేయాలి.

కాయల రక్షణకు కవర్లు: మామిడి తోటల్లో కాయలు నిమ్మకాయ అంత పరిమాణానికి పెరిగిన తరువాత ప్రొటెక్టివ్ కవర్స్ కట్టినట్టయితే టెంక పుచ్చు పురుగును నివారించవచ్చు. టెంక పుచ్చు పురుగు ఆశిస్తే కాయలు సరిగా ఎదగా, కోత కోసిన తరువాత కుళ్లిపోయి నాణ్యత కోల్పోతాయి. దీనివల్ల మార్కెట్‌లో సరైన ధర లభించక రైతు నష్టపోయే అవకాశం వుంది.

జీడిమామిడి తోటల్లో...

జీడిమామిడి తోటలు ప్రస్తుతం పూత దశలో వున్నాయి. కొద్ది రోజులుగా తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తున్నది. దీనివల్ల పూత మాడిపోవడమే కాకుండా పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశిస్తాయి. ముఖ్యంగా అధిక మంచు కారణంగా టీ దోమ ఆశిస్తాయి. టీ దోమ: ఈ దోమల తల్లి, పిల్ల పురుగులు చెట్టు లేత కొమ్మలను ఆశించి రసం పీల్చడం వల్ల ఎర్రని జిగురు కారిపోయి రెమ్మలపై నల్లని పొడవైన నూలు కండె ఆకారపు మచ్చలు ఏర్పడతాయి. దీని వల్ల పూత, పిందె మాడిపోయి దిగుబడి తగ్గుతుంది. పూత వచ్చిన తోటల్లో లీటరు నీటికి 0.6 మి.మీ.ల లామ్డా-సైహాలోత్రిన్ లేదా 2 మి.మీ.ల క్లోర్‌పైరిపాస్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పూత దశ నుంచి పిందె కట్టి బఠాణీ గింజ సైజులో ఉన్నప్పుడు లీటరు నీటికి 2 మి.మీ.ల ప్రొఫెనోఫాస్ మందును కలిపి పది నుంచి 25 రోజుల వ్యవధిలో పురుగుల ఉధృతినిబట్టి పిచికారీ చేసుకోవాలి. మార్చి నెలాఖరు వరకు పూత, పిందె దశల్లో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేస్తే టీ దోమ అదుపులో ఉంటుంది.

ఖాజీపాలెం సచివాలయానికి తాళాలు

- ఉదయం గంటపాటు ఉండి వెళ్లిపోయిన మహిళా పోలీసు
- ఆచూకీ లేని వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు
- క్షేత్రస్థాయి విధుల్లో వెల్‌నెస్ సెంటర్ అధికారి
- సెలవులో పంచాయతీ సెక్రటరీ


ఒక్క ఉద్యోగి కూడా లేని ఖాజీపాలెం సచివాలయం (ఇన్‌సెట్‌లో) తాళం వేసి ఉన్న సచివాలయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 13: గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో వుండాలన్న ప్రభుత్వ ఆదేశాలను మండలంలోని ఖాజీ పాలెం సచివాలయం ఉద్యోగులు బేఖాతరు చేస్తున్నారు. విధులకు సరిగా హాజరుకాకపోవడం, ఒకవేళ వచ్చినా.. కొద్దిసేపు వుండి బయటకు వెళ్లిపోవడం ఆనవాయితీగా మారింది. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఖాజీపాలెం గ్రామ సచివాలయంలో వివిధ విభాగాలకు సంబంధించి 11 మంది ఉద్యోగులు వున్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు మహిళా పోలీస్ వానీషా వచ్చి కార్యాలయం తాళాలు తీశారు. ఆమె జగ్గన్నపేట సచివాలయంలో విధులు కూడా అప్పగించారు. మరో గంట వరకు సిబ్బంది ఎవరూ రాలేదు. దీంతో ఆమె 11 గంటలకు ఖాజీపాలెం సచివాలయానికి తాళాలు వేసి జగ్గన్నపేట సచివాలయానికి వెళ్లిపోయారు. ఇంజనీరింగ్ అసిసెంట్ గౌస్ గ్రామ సచివాలయం భవనం పనిపై అచ్యుతాపురం వెళ్లారు. వెల్‌నెస్ సెంటర్ అధికారి ఉదయం తొమ్మిది గంటలకు వచ్చి వైద్య సేవలు నిమిత్తం బయటకు వెళ్లిపోయారు. వ్యవసాయ సహాయకుని పోస్టు ఖాళీగా ఉంది. పంచాయతీ కార్యదర్శి సెలవు పెట్టారు. ఏఎన్ఎం శిక్షణలో వున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నరేశ్, డిజిటల్ అసిస్టెంట్ ఎందుకు రాలేదో తెలియదు. వివిధ పనులపై వచ్చిన వారు సచివాలయానికి తాళం వేసి వుండడంతో తిరిగి వెళ్లిపోయారు.

టీడీపీ-జనసేన కూటమి గెలుపే లక్ష్యం

- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పిలుపు
- అనిత నివాసంలో సమావేశానికి హాజరైన అసమ్మతి నేతలు


మాజీ మంత్రి గంటా సమక్షంలో చేతులు కలిపి ఐక్యతను చాటుతున్న టీడీపీ నేతలు

నక్కపల్లి, ఫిబ్రవరి 13: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం- జనసేన కూటమి గెలుపే లక్ష్యంగా టీడీపీ శ్రేణులంగా కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సూచించారు. పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత నిర్వహించే కార్యక్రమాలకు హాజరుకాకుండా ఆమెకు దూరంగా వుంటున్నారు. అనిత ఈ విషయాన్ని ఇటీవల గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం అనిత నివాసంలో ఏర్పాటు చేసే సమావేశానికి రావాలని ఆయా నేతలకు వర్తమానం పంపినట్టు తెలిసింది. దీంతో పాయకరావుపేట నియోజకవర్గంలో అన్ని మండలాలకు చెందిన నేతలతోపాటు అసమ్మతి నాయకులు మజ్జూరి నారాయణరావు, గొర్లె రాజబాబు, నక్కపల్లి మండలానికి చెందిన బాబ్జీ, తదితరులు ఈ సమావేశానికి వచ్చారు. తనకు ఎవరూ విరోధులు కారని, అందరితోనూ సఖ్యతగానే వుంటానని ఈ సందర్భంగా అనిత చెప్పారు. దీంతో నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, జడ్పీటీసీ మాజీ సభ్యులు, ఇతర నాయకులు మాట్లాడుతూ.. గంటా శ్రీనివాసరావు, వంగలపూడి అనిత నేతృత్వంలో రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. మజ్జూరి నారాయణరావు, గొర్రెల రాజబాబుపై గతంలో విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసేలా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో మాట్లాడుతానని అనిత వారికి హామీ ఇచ్చారు.

సిద్ధాశ్రమంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 13: మండలంలోని నునపర్తి హరిహర పంచాయతన క్షేత్రం (సిద్ధాశ్రమం)లో బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం సుబ్రహ్మణ్యస్వామి, సుదర్శన స్వాములకు అభిషేకాలు, అష్టోత్తాలతోపాటు సుదర్శన యాగం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మన్యుసూక్తం, నవగ్రహాలతోపాటు లక్ష్మీగణపతి హోమాది కార్యక్రమాలు జరిగాయి. బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి కల్యానం జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గిండికోట వేంకట బ్రహ్మ శ్రీనివాస శర్మ, దిగుదాడి రుద్రయ్య, శరభయ్య, బొజ్జా అప్పారావు, కాకర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా

మునగపాక, ఫిబ్రవరి 13: వ్యవసాయదారులకు అందించే ఏజియల్ విద్యుత్‌ను తొమ్మిది గంటల నుంచి ఏడు గంటలకు కుదించడాన్ని నిరసిస్తూ బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలుగు రైతు రాష్ట్రకార్యదర్శి దాడి ముసిలినాయుడు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలోని రైతు సంఘాలు, రైతులు పార్టీలకతీతంగా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు. రైతులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ప్రయాణికులతో ఆడుకున్నారు

... 3వ పేజీ తరువాయి

ఉదయం నుంచే బస్సులు రద్దయ్యాయి. ఈ విషయం తెలియక రెగ్యులర్‌గా ఆ మార్గాల్లో ప్రయాణించేవారు బస్సుల కోసం బస్టాపులో గంటల తరబడి నిరీక్షించారు. ఎంతకీ బస్సులు రాకపోవడంతో విషయం తెలుసుకుని కొందరు ఆటోలను ఆశ్రయించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, గురుద్వారా, అక్కయ్యపాలెం, గాజువాక, సింహాచలం, పోస్టాఫీసు జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.


విశాఖ ద్వారకా కాంప్లెక్స్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

బహుమతులిచ్చే కార్యక్రమానికి మమ్మల్ని ఎందుకు తీసుకొచ్చారు?

- పోలీసులను ప్రశ్నించిన మహిళలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆటల్లో బహుమతులిచ్చే కార్యక్రమానికి తమను ఎందుకు తీసుకువచ్చారంటూ 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు వేడుకలకు వచ్చిన మహిళలు కొందరు పోలీసులను ప్రశ్నించారు. నగరంలోని డ్వాక్రా సంఘాల మహిళలను బస్సుల్లో ముగింపు వేడుకలు జరిగే స్టేడియం వద్దకు సాయంత్రం నాలుగు గంటలకే తరలించారు. సాయంత్రం ఆరు గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కడకు వచ్చేంత వరకూ వారిని గ్యాలరీల్లో కూర్చోవాలంటూ వారి ప్రాంతాలకు సంబంధించిన వలంటీర్లు, ఆర్పీలు ఆదేశించారు. తీరా అక్కడకు వెళ్లిన తర్వాత ఆటల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమం అని తెలుసుకున్నారు. పైగా గంటల తరబడి గ్యాలరీల్లో కూర్చోలేక బయటకు వెళ్లిపోయేందుకు సీట్లలో నుంచి లేచారు. వారంతా బయటకు వెళ్లిపోతుండడంతో అక్కడున్న పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. 'ఎవరికో బహుమతులు ఇచ్చేదానికి మేమందుకంటూ' తమ అసహనాన్ని వ్యక్తంచేశారు. దీంతో పోలీసులు కొందరు తమకెందుకొచ్చిన తలనొప్పి అన్నట్టు వారికి అడ్డు తప్పుకోగా, మరికొందరు మాత్రం గ్యాలరీ నుంచి బయటకు వచ్చే గేట్లకు తాళాలు వేయడం కనిపించింది. సీఎం జగన్ స్టేడియంకు రాకముందే చాలామంది మహిళలు నడుచుకుంటూ జాతీయ రహదారిపైకి వెళ్లి ఆటోల్లో తమ ఇళ్లకు వెళ్లిపోయారు. మరికొందరు తమ బస్సులు పార్కింగ్ చేసిన చోటకు వెళ్లిపోవడం విశేషం.

క్రైం... crime news

మహిళ మెడలోని బంగారం పుస్తెల తాడు తస్కరణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 13: పట్టణంలోని పూల్‌బాగ్‌రోడ్డులో భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం పుస్తెల తాడును తెంచుకుని పారిపోయారు. పట్టణ ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపిన సమాచారం మేరకు.. తుమ్మపాల గ్రామానికి చెందిన రాపేటి సరస్వతి గవరపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. సోమవారం సాయంత్రం పాఠశాల విడిచిపెట్టిన తరువాత తన భర్త శ్రీనివాసరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై పూల్‌బాగ్ రోడ్డు మీదుగా ఇంటికి వెళుతున్నారు. వెనుక నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు.. సరస్వతి మెడలో వున్న మూడు తులాల బంగారం పుస్తెలతాడును తెంచుకుని పారిపోయారు. అనంతరం శ్రీనివాసరావు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 13: ప్రమాదవశాత్తూ మేడ మెట్ల పైనుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు పట్టణ ఏఎస్ఐ మణికుమారి తెలిపారు. ఆమె వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కోట్నివీధి ప్రాంతంలో పోతంశెట్టివారివీధికి చెందిన వీసం వరలక్ష్మి(54) ఈ నెల మూడో తేదీ సాయంత్రం డాబా మెట్లను నీటితో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడిపోయింది. తలకు దెబ్బ తగలడంతో. చెవి నుంచి రక్తం కారింది. కుటుంబ సభ్యులు తొలుత ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫారసు మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. భర్త రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ మణికుమారి చెప్పారు.

కిలోన్నర గంజాయితో ఇద్దరు యువకుల అరెస్టు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 13: కిలోన్నర గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మంగళవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద తెలంగాణ రాష్ట్రం భోపాలపల్లికి చెందిన బొల్లా అనిల్, బోనగిరి యుగంధర్ కాలినడకన బ్యాగులతో వెళుతున్నారు. వారిపై అనుమానం వచ్చి ఎస్ఐ తన సిబ్బందితో తనిఖీ చేయగా కిలోన్నర గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. దీంతో వారి వద్ద ఉన్న గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయిని ఆత్మహత్య

విశాఖపట్నం, ఫిబ్రవరి 13: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక అంబేడ్కర్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం మంగళపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కె.ఝాన్సీరాణి (43) ఇక్కడి అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త 2022లో అనారోగ్యంతో మృతి చెందడం, పిల్లలు కూడా లేకపోవడంతో నిత్యం మానసిక ఆవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి వాష్ రూమ్‌కు వెళ్తానని చెప్పిన ఝాన్సీరాణి ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు బలవంతంగా తలుపులు తెరిచారు. వాష్ రూమ్‌లోని హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందిన ఆమెను చూసి చుట్టుపక్కల వారికి ఈ విషయాన్ని తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఝాన్సీరాణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి ఎస్ఐ దేవుడమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

738 కిలోల గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్టు


పట్టుబడిన గంజాయితో ఎస్ఈబీ అధికారులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 13: మన్యం నుంచి మైదాన ప్రాంతానికి వ్యాన్‌లో తరలిస్తున్న 738 కిలోల గంజాయిని మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అరెస్టు చేశామని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎస్ఈబీ సీఐ, డీటీఎఫ్ సీఐ, సిబ్బంది మంగళవారం సాయంత్రం మండలంలోని చింతలవీధి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో 738 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకొని, వాహన డ్రైవర్ పాంగి గురును అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడు ఒడిశా రాష్ట్రం జోలాపుట్టు నివాసిగా గుర్తించారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయితో సంబంధం ఉన్న జోలాపుట్టు ప్రాంతానికి చెందిన మరో నలుగురు వ్యక్తులను గుర్తించామని, వారిని విచారణ చేస్తున్నట్టు ఎన్‌ఫోర్స్ మెంట్ సూపరింటెండెంట్ తెలిపారు. పట్టుబడిన గంజాయి, వాహనం, నిందితుడిని ఎస్ఈబీ స్టేషన్‌కు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ, డీటీఎఫ్ అధికారులు సతీశ్‌కుమార్, శేఖర్‌బాబు, సురేశ్‌కుమార్, దస్తగిరి, ఎస్ఈబీ సిబ్బంది రామకృష్ణ, నాయుడు పాల్గొన్నారు.

శుక శ్యామలా రూపంలో శ్యామా అమ్మవారు


శుక శ్యామలా రూపంలో అమ్మవారు

సబ్బవరం, ఫిబ్రవరి 13: మండలంలోని దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం శుక శ్యామా రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు చదుష్ష కళలకు అధిష్ఠాన దేవత అయినందున లలిత కళల్లో ప్రావీణ్యత కోరేవారు, అభివృద్ధిని కాంక్షించేవారికి నేటి అమ్మవారి దర్శనం అద్భుత ఫలాలను ఇస్తుందని గురుపత్ని అన్నపూర్ణమ్మ భక్తులకు వివరించారు. మధ్యాహ్నం భక్తులకు ఉచిత అన్నప్రసాద సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా, భక్తులు పాల్గొన్నారు.

డీఐజీ విశాల్ గున్నీని కలిసిన ఏఎస్పీలు


డీఐజీతో సమావేశమైన పోలీసు అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13: విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన విశాల్ గున్నీని మంగళవారం పలువురు అదనపు ఎస్పీలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఐజీ అల్లూరి సీతారామరాజు, మన్యం పార్వతీపురం జిల్లాల అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో చింతూరు, అనకాపల్లి, శ్రీకాకుళం, రంపచోడవరం, పాడేరు, పార్వతీపురం సబ్ డివిజన్ అదనపు ఎస్పీలు రాహుల్‌మీనా, పి.సత్యనారాయణ, ప్రేమకాజల్, కె.ధీరజ్, జగదీష్ అడహల్లి, సునీల్ షరోన్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

ఏపీఐఐసీ జడ్ఎంపై చర్యలు తీసుకోవాలి: బండారు డిమాండ్

పరవాడ, ఫిబ్రవరి 13: పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు వినియోగించిన ఎక్స్‌కవేటర్, గ్రావెల్ రవాణాకు ఉపయోగించిన డంపర్ లారీలకు అపరాధ రుసుము విధించిన అధికారులు.. గ్రావెల్ తవ్వకాలకు పురమాయించిన ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌పై చర్యలు ఎందుకు తీసుకోలేదని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు పేరుతో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపునకు ప్రోత్సహించిన ఆయనపై చర్యలు తీసుకోవడంలో జిల్లా ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్పందించి, గ్రావెల్ అక్రమ తవ్వకాలకు కారకులైన ఏపీఐఐసీ జడ్ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బండారు డిమాండ్ చేశారు.

గ్రావెల్ తరలింపు వాహనాలకు అపరాధ రుసుము

పరవాడ, ఫిబ్రవరి 13: పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాలకు వినియోగించిన వాహనాలకు రూ.90,440 అపరాధ రుసుము విధించినట్టు గనుల శాఖ ఏడీ టి.సుబ్బారాయుడు తెలిపారు. ఎక్స్‌కవేటర్‌కు రూ.50 వేలు, నాలుగు డంపర్ లారీలకు ఒక్కోదానికి రూ.10,110 చొప్పున పెనాలిటీ విధించగా ఎం.శ్రీనివాస్ అనే వ్యక్తి నగదు చెల్లించినట్టు ఆయన వెల్లడించారు. అపరాధ రుసుము వాహనాలకు మాత్రమేనని, గ్రావెల్ తవ్విన ప్రదేశాన్ని రెండు, మూడు రోజుల్లో తమ సిబ్బంది పరిశీలించి కొలతలు వేస్తారని, ఆ మేరకు అపరాధ రుసుము వసూలు చేస్తామని ఏడీ వెల్లడించారు.

వైసీపీ నాయకుల అండతో భూ ఆక్రమణ!

- బాధిత కుటుంబం ఆందోళన

రావికమతం, ఫిబ్రవరి 13: వైసీపీ నాయకుల అండతో ఓ వడ్డీ వ్యాపారి తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్ని స్తున్నాడని ఓ కుటుంబం ఆరో పించింది. వారి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పిం చాలని నమ్మి కొండమ్మ కుటుం బ సభ్యులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కొండమ్మ మాట్లాడుతూ తట్టబంద పంచాయతీ శివారు బూరుగుపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 63/4లో 62 సెంట్ల మెట్ల భూమిని తనకు పుట్టింటి వారు ఇచ్చారని చెప్పింది. మద్యానికి బానిసైన తన భర్త రామునాయుడు పరవాడకు చెందిన సత్యనారాయణ అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ.రెండు లక్షలు అప్పుగా తీసుకున్నాడని తెలిపింది. బాకీ చెల్లించడంలో జాప్యం జరగడంతో ఆ వడ్డీ వ్యాపారి వైసీపీ నాయకుల అండతో ఆ భూమిని అతని పేరున రిజిస్ట్రేషన్ చేయించేసుకు న్నాడని ఆరోపించింది. ఆ భూమి వారిదని, ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని చెప్పింది. దీనిపై ఈ నెల 5న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపింది. ఈ భూమికి నలుగురు వారసులు ఉంటే వారికి సంబంధం లేకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేయించారని నిలదీసింది. మంగళవారం ఆ భూమిలో సిమెంట్ స్తంభాలు పాతడానికి వచ్చిన వడ్డీ వ్యాపారి చేసిన ప్రయత్నాన్ని కొండమ్మ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు.

ఉపమాకలో 'బచ్చలమల్లి' సినిమా షూటింగ్


'బచ్చలమల్లి' సినిమా సన్నివేశాలను చిత్రీకరిస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఫిబ్రవరి 13: హాస్య మూవీస్ బ్యానర్‌పై అల్లరి నరేశ్ హీరోగా నిర్మిస్తున్న 'బచ్చలమల్లి' సినిమా షూటింగ్‌ను మంగళవారం మండలంలోని ఉపమాక గ్రామంలో ప్రారంభించారు. బి.సుబ్బు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్‌లో భాగంగా ఉపమాక ఆలయ పరిసరాల్లో గ్రామీణ వాతావరణం, తిరునాళ్లకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా సినిమా షూటింగ్‌ను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రస్తుతం హీరో అల్లరి నరేశ్ కాకుండా ఇతర నటీనటులకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నామని, తరువాత జరిగే షూటింగ్‌లో అతను పాల్గొంటారని దర్శకుడు సుబ్బు తెలిపారు.

వసతి గృహం మరమ్మతులకు నిధులు

» రూ.3 లక్షలు మంజూరు చేసిన కలెక్టర్... 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

చింతపల్లి, ఫిబ్రవరి 13: స్థానిక బీసీ వెల్ఫేర్ వసతి గృహం మరమ్మతులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ.3 లక్షల నిధులు విడుదల చేశారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ గడుతూరి స్వర్ణలత తెలిపారు. బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ 'నరకమా లేక వసతి గృహమా?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ స్పందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈతో కలెక్టర్ సమావేశమై వసతి గృహం అభివృద్ధి, విద్యార్థినులకు కనీస సదుపాయాలు కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఈఈ విలేకరులతో మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో కిటికీలు, శ్లాబ్, ఫ్లోరింగ్ మరమ్మతులకు తొలివిడతగా రూ.1.5 లక్షల నిధులు విడుల చేశారన్నారు. మలి విడతగా మరో రూ.1.5 లక్షలు అందజేయనున్నట్టు కలెక్టర్ తెలిపారన్నారు. కలెక్టర్ విడుదల చేసిన నిధులతో వసతి గృహానికి మరమ్మతులు చేపడతామన్నారు. రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే వసతి గృహంలో మరుగుదొడ్లు నిర్మించేందుకు జాతీయ రహదారుల నిర్మాణ అధికారులతో కలెక్టర్ చర్చించారన్నారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభిస్తామన్నారు. నెల రోజుల్లో వసతి గృహానికి కనీస సదుపాయాలు కల్పించేందుకు కలెక్టర్ ప్రత్యేక కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు.

మాయమాటల ప్రభుత్వాన్ని సాగనంపుదాం

» సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

పాడేరు రూరల్, ఫిబ్రవరి 13: ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలకు మాయ మాటలు చెబుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడమే లక్ష్యంగా పనిచేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాష్ట్రానికి, గిరిజన ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏముందని ప్రశ్నించారు. ప్రతి ఏటా జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి, నేటివరకు నిద్రపోయి ఎన్నికలు సమీపించడంతో మెలకువ వచ్చి మళ్లీ మోసగించేందుకు డీఎస్సీ ప్రకటించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో అన్ని రంగాల ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆయన దుయ్యబట్టారు.

మద్యపాన నిషేధం లేదు.. నాసిరకం మద్యమే

అధికారంలోకి వచ్చాక సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామని ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి, నిషేధం అమలును మరిచి నాసిరకం మద్యాన్ని ప్రభుత్వం ద్వారానే అమ్మకాలు చేయించడం దారుణమని సీపీఐ నేత సత్యనారాయణ అన్నారు. నాసిరకం మద్యం విక్రయాల ద్వారా ఆర్థిక లాభాలను పొందారరని ఆరోపించారు. కొత్తపల్లి గీత ఆదివాసీ మహిళ కాదని, ఈ విషయంలో ఆదివాసీలు పోరాటాలు చేసిన విషయం ప్రభుత్వాలకు తెలిసిందేనని చెప్పారు. గీతకు టిక్కెట్ కేటాయింపు విషయంపై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కూడా రాధాకృష్ణ, జల్లి రాజుబాబు, చంటిబాబు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన సేవలు అందించండి

» ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



జిల్లా ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 13: క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. చింతపల్లి మండలం భీమనపల్లి వద్ద సోమవారం జరిగిన జీపు బోల్తా ఘటనలో గాయపడ్డ క్షతగాత్రులను స్థానిక జిల్లా ఆస్పత్రిలో మంగళవారం ఉదయం పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడిన క్షతగాత్రుల వివరాలు, కేజీహెచ్‌కు తరలించిన బాధితుల సమాచారం తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మాట్లాడి ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎస్.రామకృష్ణ, జి.సన్యాసి దొర, కె.చిన్నారావు, వి.సూర్యప్రకాశ్‌నాయుడు పాల్గొన్నారు.

చింతపల్లిలో బాధిత కుటుంబాలకు పరామర్శ

చింతపల్లి: మండలంలోని సంపంగిపుట్టు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైసీపీ నియోజకవర్గం సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. ఈ ఘటన చాలా బాధాకరమని, బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మాజీ ఎంపీపీ కవడం మచ్చమ్మ, సర్పంచ్ దురియా పుష్పలత, వైసీపీ మండల అధ్యక్షుడు మోరీ రవి, మాజీ ఎంపీపీ వంతల బాబూరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులపై పాలక పక్షాల నిర్లక్ష్యం

» ఆమ్‌ఆద్మీ పార్టీ పాడేరు ఇన్‌చార్జి గంగరాజు

జి.మాడుగుల, ఫిబ్రవరి 13: రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ఆదివాసీల హక్కులపై పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆమ్‌ఆద్మీ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి సొనారి గంగరాజు అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదివాసీల మీద ప్రేమలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు ఆక్సిజన్ వంటి నూరు శాతం ఉద్యోగ ఉపాధి పొందే జీవో నంబరు-3 సుప్రీంకోర్టు రద్దు చేసినప్పుడు ఎంపీ, ఎమ్మెల్యేలు కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఆదివాసీ ప్రాంతంపై కనీస అవగాహన కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎన్నికల్లో గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళ హక్కుల పరిరక్షణ కార్యదర్శి రూడి రమణమ్మ, మోసియా తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ సాధనకు పోస్టుకార్డు ఉద్యమం



పోస్టు కార్డు క్యాంపెయిన్ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 13: పాత పెన్షన్ సాధన (ఓపీఎస్) కోసం పోస్టు కార్డు ఉద్యమం చేపడతామని యూటీఎఫ్ సంఘం మండల అధ్యక్షుడు సమరెడ్డి రాజు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం పోస్టు కార్డు క్యాంపెయిన్ నిర్వహించారు. అలాగే ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్ పెయింటింగ్స్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ ప్రయోజనాలను తెలియజేసేందుకు ప్రజల్లోకి వెళుతున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ సాధన కోసం వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. తాజాగా ప్రకటించిన డీఎస్సీ 2024 నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అల్లూరి జిల్లా కార్యదర్శి మొశ్యా ధర్మారావు, మండల నాయకులు ఎస్.గోపి, పుండరీ, వీరన్న, దాసు, అవినాష్, ధనుపతి, గణేష్, క్రిష్ణ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయండి

» జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు... హాజరైన అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్ఎంలు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 13: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్దల్లో భాగంగా అందిస్తున్న గుడ్లు, చిక్కి, రాగిజావ మెనూ పక్కాగా అమలు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు ఆదేశించారు. స్థానిక శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో వంట కార్మికుల బిల్లులు, శానిటేషన్ వర్కర్ల డ్యూటీ సర్టిఫికెట్‌లు నిర్ణయించిన సమయానికి కార్యాలయంలో అందించాలన్నారు. ప్రతీ రోజు విద్యార్థుల హాజరును యాప్‌లో వేయాలన్నారు. మెనూతో పాటు మరుగుదొడ్ల ఫోటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. పిల్లలకు నిర్వహించిన పరీక్షలకు సంబంధించి మార్కులను కూడా ఆన్‌లైన్ చేయాలన్నారు. విద్యార్థుల వర్క్ బుక్స్, నోట్‌బుక్స్ ఎప్పటికప్పుడు కరెక్షన్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో మిడ్డే మీల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అప్పారావు, ఎంఈవో-1 ఎస్.రామచందరరావు, ఎంఈవో-2 సీహెచ్.సరస్వతీదేవి, వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో విద్యార్థుల మరణాలు పట్టవా?

» పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమించండి

» గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ

పాడేరు రూరల్, ఫిబ్రవరి 13: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అనారోగ్యాలకు గురై విద్యార్థులు మృతి చెందుతున్నా ప్రభుత్వం, అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ ప్రశ్నించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం పాడేరు గురుకుల పాఠశాల్లో ఏడో తరగతి చదువుతున్న కుంచా పూర్ణభార్గవి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నదని, స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందడం విచాకరమని వాపోయారు. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థిన భార్గవి అనారోగ్యంతో కొన్ని రోజులుగా ఇంటి వద్ద ఉందని, సోమవారం పరిస్థితి మరింత విషమించడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఆదివాసీ ప్రాంతంలో విద్యార్థుల వరుస మరణాలు సంభవిస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన అసహనం వ్యక్తం చేశారు. మరణాలకు గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టకపోవడం ఆదివాసీ విద్యార్థుల దురదృష్టమని వాపోయారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయకపోవడం, తాగునీటి సదుపాయం కల్పించకపోవడం, విద్యార్థుల ఆరోగ్య పరీక్షల నిర్వహణకు హెల్త్ వలంటీర్‌లు లేకపోవడంతోనే మరణాలు సంభవిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్‌లను నియమించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణరావు, ఆమోష్, కృష్ణ పాల్గొన్నారు.

16న వైటీసీలో మినీ జాబ్‌మేళా

అరకులోయ, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)లో ఈ నెల 16వ తేదీన మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరగనున్న జాబ్‌మేళాలో నవతరో డ్ ట్రాన్స్‌పోర్టు, అపోలో ఫార్మసీ, డెలివరి.కామ్ కంపెనీలు పాల్గొంటున్నాయి. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య గల టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు నెలకు జీతం ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9398338105 నంబరు సంప్రదించాలన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 13: పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్యాధికారి రాంబాబు చెప్పారు. మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గిరిజనులకు సేవలు అందించారు. సాధారణ వ్యాధులు, జ్వరాలతో ఉన్న బాధితులకు రక్తపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక సేవలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు పాటించాల్సిన సూత్రాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రత్నమ్మ, పద్మ, లోవరాజు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 13: మండలంలోని దారెల పంచా యతీ కేంద్రంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ పి.పాండు రంగస్వామి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధుల వెచ్చించి పంచాయతీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి సుమారు 115 మీటర్లు పొడుగున సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పనులు పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పి.మల్లికార్జున రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్.గిరీష్ దొర, పంచాయతీ కార్యదర్శి జి.అర్జయ్య తదితరులు పాల్గొన్నారు.

కాఫీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

చింతపల్లి, ఫిబ్రవరి 13: ఏపీఎఫ్‌డీసీ పరిధిలో పనిచేస్తున్న కాఫీ కార్మికులకు కనీస వేతనం చట్టం ఆధారంగా కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. కిన్నెర్ల ఏపీఎఫ్‌డీసీ కాఫీ ఎస్టేట్‌లో కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ 2023 అక్టోబరు నుంచి నేటి వరకు కార్మికుల కూలి రేట్లు పెంచలేదన్నారు. ఏపీఎఫ్‌డీసీ అధికారులు తక్షణమే స్పందించి పెరిగిన వేజ్ ఆధారంగా కూలి రేట్లు పెంచాలన్నారు. అలాగే కార్మికులకు నెలలో 26 రోజులు పని కల్పించాలన్నారు. వివిధ ఎస్టేట్ల పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు నివాస గృహాలను మరమ్మతు చేపట్టాలన్నారు. కాఫీ తోటల్లో వాచ్‌మన్‌లను నియమించాలన్నారు. ఈ సమస్యలను ఏపీఎఫ్‌డీసీ అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాములమ్మ, దేవి, సరస్వతి, కనకవల్లి తదితరులు పాల్గొన్నారు.

బాలికా హక్కుల పరిరక్షణకు ముందుకురావాలి

» ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ

చింతపల్లి, ఫిబ్రవరి 13: బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒకరు ముందుకురావాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో బీవీ రమణ కోరారు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలిక దినోత్సవంలో భాగంగా బేటీ బచావో, బేటీ పఢో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం ప్రత్యేక హక్కులు, చట్టాలు ఉన్నాయని, వీటిపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, విద్యాహక్కు, నిర్బంధ విద్య, పోక్సో చట్టంపై చైతన్యం కలిగి ఉండాలన్నారు. బాలికపై ఎవరైన లైంగిక వేధింపులకు గురిచేస్తే మహిళా కానిస్టేబుళ్లను, పోలీసులను ఆశ్రయించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీర సాయిబాబు, పాస్టర్ శ్యాంసన్, పూజారి వైవీఎస్ సాయిబాబా, మసీద్ ముల్లా ఎస్కే అమీర్, హెచ్ఎం గోపీనాథ్, సూపర్‌వైజర్లు కె. విజయకుమారి, స్కే గౌహర్ ఉన్నీష, గౌరి, సత్యవతి, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

కలెక్టర్ గుర్రు

... 3వ పేజీ తరువాయి

విచారణ జరిపి ఆరుగురు అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. కాగా ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరవుతున్నప్పటికీ, జిల్లా ఖజానా అధికారి మాత్రం హాజరుకావడం లేదు. ఈ వ్యవహారంపైనా కలెక్టర్ జిల్లా ఖజానా, లెక్కల అధికారి ప్రసాద్‌బాబుపై అసంతృప్తిగా ఉన్నారు. ఈ తరుణంలో మంగళవారం ఉదయం విధులకు సకాలంలో హాజరుకాకపోవడంతో కార్యాలయానికి కలెక్టర్ తాళం వేయించారు. ఈ వ్యవహారం జిల్లాలోని ప్రభుత్వ విభాగాల్లో చర్చనీయాంశంగా మారింది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మణికుమారి

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించాలి

» దోకులూరు శంఖారావంలో మాజీ మంత్రి మణికుమారి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 13: తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి కోరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రాష్ట్రంలో చేపట్టిన శంఖారావం కార్యక్రమానికి మద్దతుగా టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు దోకులూరులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాంలో ఆమె మాట్లాడారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దోచుకోవడం దాచుకోవడం, మాట తప్పడం మడం తిప్పడం వంటి మహత్తర కార్యక్రమాలు చేసి ప్రజలను మోసగించారే తప్ప రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, నాయకులు వర్తన పిన్నయ్యదొర, తమర్భ నాగం నాయుడు, కిముడు చిట్టిబాబు, డూరి కృష్ణారావు, వంతాల కొండబాబు, తమర్భ కాంతమ్మ, గొల్లూరి చిన్నారావు, కిల్లో రత్నాలమ్మ, డూరి చంద్రకళ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు సొంత గూడు!

... 3వ పేజీ తరువాయి

చేసింది. అయితే మరో రెండు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

నివాస గృహాల నిర్మాణానికి స్థలాల అన్వేషణ

జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగుల కోసం నివాస గృహాలను నిర్మించేందుకు రెవెన్యూ అధికారులు స్థలాలను అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం పాడేరులో ఉన్న ప్రభుత్వ నివాస గృహాల్లో ఐటీడీఏ, ఇతర శాఖల ఉద్యోగులున్నారు. దీంతో కొత్తగా వచ్చిన జిల్లా కార్యాలయాలకు చెందిన అధికారులు, ఉద్యోగులకు వసతి సమస్య ఏర్పడింది. ప్రభుత్వ పరంగా నివాస గృహాల నిర్మాణం కోసం సైతం సుమారుగా పది ఎకరాల స్థలాన్ని గుర్తించాలనే లక్ష్యంతో రెవెన్యూ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మన్యం గజగజ

... 3వ పేజీ తరువాయి

పొందుతున్నారు.

జీకే వీధి, చింతపల్లిలో..

చింతపల్లి: మన్యం మరోసారి గజగజ వణుకుతున్నది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. మంగళవారం జీకేవీధిలో అత్యల్పంగా 7.2, చింతపల్లిలో 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. సాధారణంగా గిరిజన ప్రాంతంలో డిసెంబరు రెండో పక్షం నుంచి జనవరి మొదటి పక్షం వరకు ఏక సంఖ్యలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈ ఏడాది శీతాకాల సీజన్ ఆఖరిలోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఏక సంఖ్యలో నమోదవుతున్నాయి. దీంతో చలి ఉధృతి భారీగా పెరిగిపోయింది. చలితో పాటు మంచు దట్టంగా కురుస్తున్నది. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటల వరకు లంబసింగి, తాజంగి, చింతపల్లి, ఆర్‌వీనగర్, జీకేవీధి ప్రాంతాల్లో దట్టంగా కురుస్తున్నది. ప్రతి వీధిలో చలి మంటలు కనిపిస్తున్నాయి.

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

... 3వ పేజీ తరువాయి

ఆళ్ల రామలింగంనాయుడు 99.967, అన్నెపు సాత్విక్ 99.959 పర్సంటైల్ సాధించారు. ఫిట్జీ విద్యార్థి శ్రీరామ వెంకటకృష్ణ 99.936, అసెంట్ విద్యార్థి డొంకా హరీష్‌కుమార్ 99.931 పర్సంటైల్ సాధించారు.

ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేయాలన్నదే లక్ష్యం

-మద్ది రిషివర్ధన్, 99.999 పర్సంటైల్ విద్యార్థి

జేఈఈ మెయిన్స్‌లో 99.999 పర్సంటైల్ సాధించడం సంతోషంగా ఉంది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు నారాయణ విద్యా సంస్థల్లోనే చదివా. టెన్త్ సీబీఎస్ఈ సిలబస్‌లో 476 మార్కులు వచ్చాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చేయాలన్నదే లక్ష్యం. సొంతూరు విజయనగరం. నాన్న తిరుపతిరావు గజపతినగరంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 7.15 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకూ సుమారు 14 గంటలపాటు చదువుకు కేటాయించేవాడిని

రోజుకు 16 గంటలు చదివేవాడిని

-కోరుప్రోలు రాకేష్, 99.978 పర్సంటైల్ విద్యార్థి

సొంతూరు విశాఖపట్నం. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు శ్రీచైతన్య విద్యా సంస్థలలో చదివాను. టెన్త్‌లో 590 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో 99.978 పర్సంటైల్ సాధించడం సంతోషంగా ఉంది. మరింత మెరుగైన పర్సంటైల్ కోసం ఏప్రిల్‌లో జరగనున్న సెకండ్ సెషన్ పరీక్షలకు హాజరవుతా. తరువాత ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించడం ద్వారా ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరాలన్నదే లక్ష్యం. రోజుకు 16 గంటలపాటు చదివాను. నాన్న సతీష్ ఆయుర్వేద వ్యాపారం చేస్తారు. ఐఐటీలో చదివిన మా మేనమామే స్ఫూర్తి.

సంక్షిప్తంగా..

'దగాకోరు డీఎస్సీతో నిరుద్యోగ యువతకు మోసం'

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 13: వైసీపీ ప్రభుత్వం దగాకోరు డీఎస్సీని ప్రకటించి నిరుద్యోగ యువతను మోసం చేసిందని టీఎన్‌టీయూసీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి స్వామి విమర్శించారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్ అని నిరుద్యోగులను నిండా మోసం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కంటి తుడుపుగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించి ఓట్లు దండుకునేందుకే ప్రభుత్వం పూనుకుందన్నారు. నిరుద్యోగులు వైసీపీ ప్రభుత్వ మాయ మాటలకు తలొగ్గకుండా తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి నిరుద్యోగులు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. దగాకోరు డీఎస్సీతో ఒరిగిందేమి లేదని, ప్రభుత్వానికి సాగనంపేందుకు యువత ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు.

కొడుకు కొట్టాడన్న మనస్తాపంతో తల్లి ఆత్మహత్యాయత్నం

సీలేరు, ఫిబ్రవరి 13: అన్నం వండలేదన్న కోపంతో కొడుకు కొట్టడంతో మనస్తాపానికి గురైన ఓ తల్లి పురుగుల మందును ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జీకే వీధి మండలంలోని దుప్పులవాడ పంచాయతీ పరిధిలో పిల్లిగెడ్డ గ్రామానికి చెందిన కొర్రా పాతిమా అన్నం వండలేదన్న కోపంతో ఆమె కొడుకు కొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగింది. ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో మంగళవారం ఆమెను సీలేరు ప్రాథమిక ఆసుపత్రికి తరలించగా, ఇక్కడ ప్రథమ చికిత్సను అందించి మెరుగైన వైద్య సేవల కోసం చింతపల్లి ఆసుపత్రికి జెన్‌కో సీఎస్ఆర్ అంబులెన్సులో తరలించారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

సీలేరు, ఫిబ్రవరి 13: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరులో మంగళవారం వీధి కుక్కల దాడిలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. దుర్గావీధికి చెందిన కొర్రా శివ మంగళవారం జీలుగు కల్లు సేకరణకు జెన్‌కో చెక్‌పోస్టు సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి తిరిగి వస్తుండగా మూడు కుక్కలు ఒక్కసారిగా అతనిపై దాడి చేశాయి. దీంతో పెద్ద పెద్ద గాట్లు పడి తీవ్రంగా గాయపడ్డ అతన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అలాగే దుర్గావీధికి చెందిన మరో వ్యక్తి కొర్రా సైతాన్‌పై కూడా కుక్కలు దాడి చేసి గాయపర్చడంతో, అతనికి కూడా ప్రభుత్వ వైద్య సిబ్బంది సేవలను అందించారు.

19న మండల సర్వసభ్య సమావేశం

కొయ్యూరు, ఫిబ్రవరి 13: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 19న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతయ్య నాయుడు తెలిపారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి 33 పంచాయతీల సర్పంచులు, అన్ని సెగ్మెంట్ల ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పది లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

జి.మాడుగుల, ఫిబ్రవరి 13: మండలంలోని ఉరుము కూడలిలో మంగళవారం పది లీటర్ల సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా అటుగా నడుచుకుంటూ వస్తున్న సమీప గాంధీనగర్ కాలనీకి చెందిన జి.బాలు పది లీటర్ల నాటుసారా క్యాన్‌తో పట్టుబడ్డాడని చెప్పారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మండలంలో నాటుసారా క్రయవిక్రయాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.40 లీటర్లు సారాతో మహిళ అరెస్టు

పత్రిమెట్టలో మరొకరు..

హుకుంపేట: తడిగిరి పంచాయతీలోని పత్రిమెట్ట గ్రామంలో సారా విక్రయిస్తున్న పాంగి సావిత్రిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మంగళవారం గ్రామంలో దాడులు చేయగా సావిత్రిత పట్టుబడ్డారన్నారు. ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

16న మెగా నేత్ర వైద్య శిబిరం

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 13: మండలంలోని లక్కవరపుపేట పంచాయతీ కేంద్రంలో ఈ నెల 16న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు కేబీ ఫౌండేషన్ చైర్మన్ కొక్కుల కన్నబాబు తెలిపారు. శంకర్ ఫౌండేషన్‌తో కలిసి ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దృష్టి లోపం కలిగిన ప్రజలకు ప్రత్యేక చికిత్స అందించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచి కిత్సలు చేయిస్తామన్నారు. అలాగే కంటి అద్దాలు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ శిబిరాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అంగన్‌వాడీ దరఖాస్తుల పరిశీలన

కొయ్యూరు, ఫిబ్రవరి 13: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు పెట్టుకున్న అభ్యర్థుల ఒరిజనల్ ధ్రువపత్రాలను బుధవారం పరిశీలిస్తామని సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయానికి అభ్యర్థులు అన్ని పత్రాలతో హాజరుకావాలని సూచించారు. మండలంలో రెండు మినీ అంగన్‌వాడీ, మరో రెండు ఆయా పోస్టులకు సంబంధించి ఆయా పంచాయతీల నుంచి ఆరు దరఖాస్తులు అందాయన్నారు. అలాగే ఈ నెల 16వ తేదీన పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరీక్ష ఉంటుందని చెప్పారు.

లక్ష్మీనృసింహ దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 13: ఏనుగురాయి పంచాయతీ సెల్లుమ్ గ్రామంలో లక్ష్మీనృసింహ దేవాలయం నిర్మాణానికి ఆ శాఖ మంత్రి సత్యనారాయణ రూ.60 లక్షలు మంజూరు చేశారని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. మంగళవారం స్థానిక విలేకర్లకు ఫోన్‌లో ఈ సమాచారం తెలియజేశారు. విశాఖ వచ్చిన మంత్రిని కలిసి దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా, సానుకూలంగా స్పందించారని చెప్పారు. త్వరలో ఆ పనులు ప్రారంభమవుతాయని ఆమె వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 13: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తున్నట్టు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రేగం మత్స్యలింగం అన్నారు. బంగారుమెట్ట పంచాయతీలోని వందనపల్లి, సరియపల్లి, మెట్టబాదిపుట్టు తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించి గిరిజనులతో మాట్లాడారు. దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తమ ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.తర్నాలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్.కొండమ్మ, మాజీ వైస్ ఎంపీపీ బి.రవి ప్రసాదు, జేసీయస్ కన్వీనర్ వి.కొండలరావు పాల్గొన్నారు.